

గుండెపోటుతో ఎఎస్ఐ మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం


ఎఎస్ఐ పెద్దబ్బాయి

ప్రత్తిపాడు ఎఎస్ఐ పి.పెద్దబ్బాయి(60)శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. రాజవొమ్మంగి మండలం లాగరాయి గ్రామానికి చెందిన పెద్దబ్బాయి కానిస్టేబుల్‌గా పోలీస్ డిపార్ట్మెంట్‌లో చేరి, అంచలంచెలుగా ఎఎస్ఐ స్థాయికి ఎదిగారు. ఆయన భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం తెల్లవారుజామున అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆయన మృతి పట్ల ప్రత్తిపాడు సిఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అంత్యక్రియలను ఆయన స్వగ్రామమైన లాగరాయిలో నిర్వహించారు.

సరుకుల్లో కోత..!

- 2 నెలలుగా సరఫరా కాని ఆయిల్, కందిపప్పు
- అయినా యాప్‌ల్లో నమోదు చేయాల్సిందే
- అంగన్‌వాడీ వర్కర్లపై అధికారుల ఒత్తిళ్లు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలవుతున్న స్త్రీ, శిశు సంక్షేమ సేవలు అరకొరగానే అందుతున్నాయి. సెంటర్లకు పూర్తిస్థాయిలో సరుకులు అందడం లేదు. అవీ సకాలంలో చేరడం లేదు. దీంతో గర్భిణులు, బాలింతలతోపాటు పిల్లలకు పౌష్టికాహారం అరకొరగానే అందుతుంది. రెండు నెలలుగా పలు కేంద్రాలకు ఆయిల్, కందిపప్పు సరఫరా కావడం లేదు. ప్రతినెలా మొదటి, రెండో శుక్రవారం లోపే లబ్ధిదారులకు సరుకులు ఇవ్వాల్సి ఉంది. అంటే 10వ తేదీ లోపు అందరికీ పంపిణీ పూర్తి కావాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో బియ్యం, కందిపప్పు, పాలు, గుడ్లు సకాలంలో చేరుకోని పరిస్థితి ఉంది. అయితే ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత సమయానికే లబ్ధిదారులకు సరుకులు చేరుతున్నట్లుగా యాప్‌లలో నమోదు చేయాల్సిందిగా అంగన్‌వాడీ కార్యకర్తలపై అధికారుల తీవ్ర ఒత్తిళ్లు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

మెనూ ఇలా..

కాకినాడ జిల్లా పరిధిలోని 10 ప్రాజెక్టుల్లో 1986 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలోని 16,43 మంది గర్భిణులు, 11,989 మంది బాలింతలు, 6 నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు 1,06,949 మంది సేవలు పొందుతున్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలు, 3 సంవత్సరాల లోపు పిల్లలకు ఇంటికే పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్నారు. 3 నుంచి ఆరేళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నుంచి శనివారం వరకు అన్నం, పులిహోర, ఎగ్ ఫ్రైడ్ రైస్, వెజిటబుల్ రైస్, దోసకాయ, టమోటా, ఆకుకూర, బీరకాయ, సొరకాయ, మునగాకు, పాలకూర, పప్పు, కూరగాయలతోపాటు సాంబారు, 100 మి.లీ. కాచిన పాలు అందిస్తారు.

పంపిణీ కాని ఆయిల్, కందిపప్పు

మూడు సంవత్సరాల లోపు పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు మొదటి శుక్రవారం తొలి విడతలో పాలు, గుడ్లు, బియ్యం, పప్పు, రెండో శుక్రవారం రెండో విడత గుడ్లు, పాలు, సంపూర్ణ పోషణ కిట్టు అందజేయాల్సి ఉంది. మూడు నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు కేంద్రాలలోనే భోజనాలు వండి పెట్టడంతోపాటు ఉడికించిన గుడ్డు, కాచిన పాలు అందచేయాల్సివుంది. అయితే జిల్లాలో 80 శాతం కేంద్రాలకు ఆయిల్, కందిపప్పు సరఫరా కావడం లేదని పలువురు



అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక సరుకుల్లో కోత విధిస్తున్నప్పటికీ మిగిలిన సరుకులనే లబ్ధిదారులకు అందిస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రతి నెల 10వ తేదీ లోపే పూర్తిస్థాయిలో సరుకులు చేరాల్సి ఉన్నా 15 నుంచి 20 తేదీ దాటినా పంపిణీ కాని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బియ్యం, ఆయిల్, కందిపప్పు సకాలంలో లబ్ధిదారులకు ఇవ్వాలంటే ప్రభుత్వం ఎంఎల్ఎస్ పాయింట్లకు సరుకులను అంతకుముందే చేర్చాల్సి ఉంది. కానీ సరఫరా విధానం లోపాభూయిష్టంగా మారడంతో ప్రతి నెల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈనెల 5వ తేదీలోపు కేవలం పాలు, గుడ్లు మాత్రమే కేంద్రాలకు చేరుకున్నాయి. కొన్ని కేంద్రాలకు ఈ శుక్రవారం నాటికి బియ్యం, ఆయిల్ సంపూర్ణ పోషణ కిట్లు చేరినప్పటికీ, ఇంకా పలు కేంద్రాలకు పూర్తిస్థాయిలో సరుకులు చేరుకోకపోవడం గమనార్హం. కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు కనీసం 50 గ్రాముల బరువు ఉండాలన్న నిబంధన ఉంది. అయితే అనేక కేంద్రాలకు సరఫరా చేస్తున్న గుడ్లు 30 నుంచి 35 గ్రాముల్లోపే ఉంటున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు.

అధికారుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు

ప్రభుత్వ నిర్లక్ష్యం వలన లబ్ధిదారులకు అనుకున్న సమయానికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే కిట్లు, పాలు, గుడ్లు, బియ్యం, పప్పు, ఆయిల్ ఇవ్వలేకపోతున్నారు. అయితే పదో తేదీ లోపే అన్ని సరుకులు లబ్ధిదారులకు చేరుతున్నాయన్నట్లుగా ఫేస్ రికైజనింగ్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్)లో నమోదు చేయాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్‌వాడీ కార్యకర్తలై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నారు. వాస్తవానికి పలు కేంద్రాలకు 10 నుంచి 15వ తేదీ, కొన్ని కేంద్రాలకు 20వ తేదీ లోపు మాత్రమే సరుకులు అందుతున్నాయి. అయితే మొదటి వారంలోనే సరుకులు అందినట్లుగా నమోదు చేయిస్తుండడంపై అధికారులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లబ్ధిదారుల వద్దకు వెళ్లి సరుకులు ఇవ్వకుండానే నమోదు చేయాల్సి వస్తుండడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇవ్వకుండా ఇచ్చినట్లుగా యాప్‌లలో ఎలా నమోదు చేస్తారంటూ లబ్ధిదారులు మండిపడుతున్న పరిస్థితులు కూడా నెలకొంటున్నాయి. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా జిల్లా అధికారులు అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో పూర్తిస్థాయి సరుకులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు.


కాకినాడలో యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న యూనియన్ నేత

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. పలు మండల కేంద్రాల్లో యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. పలు కేంద్రాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధ్యాయ ఉద్యమ నేతలకు ఘనంగా నివాళులర్పించారు.

కాకినాడ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక వి.సూర్యనారాయణరాజు టీచర్స్ హోంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెవివి.నగేష్ అధ్యక్షతన యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభాకర వర్మ మాట్లాడారు. 1974 ఆగస్టు 10న యుటిఎఫ్ ఆవిర్భావం జరిగిందన్నారు. క్యాడర్, మేనేజ్‌మెంట్, ప్రాంతీయ విభేదాలను అధిగమించి ఉపాధ్యాయులందర్నీ ఐక్య పరచాలనే లక్ష్యంతో అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రస్థానం సాగిందన్నారు. హక్కులు, బాధ్యులు రెండు నేత్రాలుగా ఎందరో పోరాట యోధులు కృషి చేశారని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ సంఘాల్లో అగ్రగామి సంఘంగా యుటిఎఫ్ నిలిచిందన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడలో ఈ ఏడాది డిసెంబర్ 14, 15, 16, 17 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులంతా యుటిఎఫ్‌ను మరింతగా బలోపేతం చేసుకుని, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పివిఎన్.గణేశ్వరరావు, సంక్షేమ పథకం ప్రధాన కార్యదర్శి ఎన్.గోవిందరాజులు, జిల్లా కార్యదర్శి వజ్రపు మహేష్, సంక్షేమ పథకం డైరెక్టర్ ఎ. సీతారామరాజుతోపాటు వరహాలుబాబు, రవి శ్రీనివాస్, కెఎంకె మూర్తి, నఫీసా, తౌఫిక్, శ్రీదేవి, సుభద్ర, జహ, మాధురి పాల్గొన్నారు. **రౌతులపూడి** స్థానికంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు కొరుప్రోలు హరిబాబు, సీనియర్ నాయకులు కోళ్ల రాంబాబు యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు. రొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నాగరాజు, తాతబాబు, ఆర్‌విఆర్.మూర్తి పాల్గొన్నారు. **ఏలేశ్వరం** ప్రత్తిపాడు ఎంఆర్‌సి భవనంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం యుటిఎఫ్ మండల అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు చెరుకూరి చిన్నసత్యనారాయణ, జంధ్యాల అప్పలరాజు పాల్గొని పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వివి.రమణ, ఆర్.రామలింగేశ్వరరావు, డి.రాజబాబు, ఎంవి.రమణ, సిహెచ్‌వి.సూర్యావతి, కృష్ణవేణి పాల్గొన్నారు. **కోటనందూరు** స్థానికవిద్యా వనరుల కేంద్రం సమీపంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు దాడి గోవిందరావు పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉపాధ్యాయులు వి.రామలింగం, పి.దాలినాయుడు, ప్రకాశరావు, వై.వెంకటరమణ యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆసుపత్రిలో రోగులకు రొట్టె, పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.తాజుద్దీన్‌బాబా, ఉపాధ్యాయులు ఎం.రమణమూర్తి, దాడి శివకుమార్, కె.మురళినాయుడు, ఎం.భారతలక్ష్మి, కె.ఉమారాణి, యువి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ఉచిత సుగర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత షుగర్ వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షులు ఎన్ఆర్‌వైవి.ప్రసాద్, కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, కోశాధికారి బడుగు సీతారామరాజు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పెద్దబాజార్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. షుగర్ వ్యాధి ఉన్నవారు, లేనివారికి అనుభవజ్ఞులైన వైద్యులతో పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందిస్తామని చెప్పారు. ఇప్పటికే షుగర్ వ్యాధితో ఉన్న వారు తమ పాత రిపోర్టులతో రావాలన్నారు. ఈ శిభిరాన్ని పట్టణ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వినేశ్ ఫోగట్‌కు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ



సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న పౌర సంక్షేమం సంఘం ప్రతినిధులు

భారత ఒలింపిక్స్ స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్‌కు సంఘీభావంగా పౌర సంక్షే మ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శనివారం మాధవ నగర్ ఆర్ఎంసి గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీ చేశారు. అనంతరం సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ ఒలంపిక్స్‌లో వినేశ్ ఫోగట్‌కు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడ దన్నారు. భారత ప్రభుత్వం ఆమెకు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యా స్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ, ప్రజా సంఘాల నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ, తిరుమల శెట్టి నాగేశ్వరరావు, చింతపల్లి అజయ్‌కుమార్, వి.రవికుమార్, కృష్ణాజీ, బిఎస్ఎఫ్ విశ్రాంత అధికారి మహేష్, మాజీ సైనికులు గంటా ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

పలువురు తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

పెదపూడి మండల తహశీల్దార్‌గా పివి.సీతాపతిరావు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కోటనందూరు మండల డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేసిన ఆయన పెదపూడి తహశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఆయన మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.


ఏలేశ్వరం తహశీల్దార్‌ను అభినందిస్తున్న ఉదోయగులు

ఆయనకు విఆర్ఒలు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. **ఏలేశ్వరం** మండల తహశీల్దార్‌గా ఆర్‌వి.వెంకటేశ్వర రావు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గొల్లప్రోలు తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు విఆర్ఒలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. **సామర్లకోట** మండల తహశీల్దార్‌గా కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రజాప్రతినిధులు, విఆర్ఒలు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు


సామర్లకోట తహశీల్దార్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, సర్వే డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎంసి ఛైర్మన్‌కు అభినందన

ప్రజాశక్తి - తాళ్లరేవు


శివను అభినందిస్తున్న వరదరాజు, ఇతరులు

గాడి మొగ పంచాయతీ లక్ష్మీపతిపురం హైస్కూల్ ఎస్ఎంసి ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చెక్కా శివను పలువురు అభినందించారు. టిడిపి నాయకులు మల్లాడి వరదరాజు ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్లో ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ వాడ్రేవు వీరవేణి, హెచ్ఎం ఆర్.విజయలక్ష్మి, నాయకులు అంగాడి తాతారావు, కె. బాబూరావు, రామారావు, వీరబాబు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

ప్రజాశక్తి - కోటనందూరు


వరి పొలాలను పరిశీలిస్తున్న యనమల రాజేష్

వర్షాల వల్ల పంటను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని టిడిపి నాయకులు యనమల రాజేష్ అన్నారు. శనివారం తొండంగి మండలంలో కోదాడ పంచాయతీ పరిధిలో నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా అందర్నీ ఆదుకుంటామని అన్నారు. పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక అందించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రవాణాతో అవస్థలు

- ఇష్టారాజ్యంగా యాజమాన్యాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ప్రధాన రహదారుల్లో ప్రయాణిస్తున్న భారీ వాహనాల రవాణాతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గ్రామీణ రహదారుల్లో టన్నుల కొద్దీ బరువుతో వస్తున్న క్వారీ, క్రషర్ లారీలతో ప్రయాణికులు ఆందోళనకు గురౌతున్నారు. మండలంలోని ములగపూడి, ఎస్ పైడిపాల, మల్లంపేట, కుప్పంపాలెం గ్రామాల్లో క్వారీలు, క్రసర్లు పనిచేస్తున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన నల్ల రాయికి డిమాండ్ ఉండటంతో వివిధ జిల్లాలకు ఇక్కడ నుంచే గృహ అవసరాలకు, ప్రభుత్వ నిర్మాణ పనులకు రవాణా సాగుతుంది. అంతేకాకుండా మండలంలోని మల్లాపురంలో చేపడుతున్న పోర్టు, సెజ్ నిర్మాణ పనులకు ఇక్కడి నుంచే రాయిని తరలిస్తున్నారు. దీంతో రాయిని తరలించేందుకు భారీ వాహనాలను వినియోగిస్తున్నారు. త్వరితగతిన అన్‌లోడ్ చేయాలని, లేదంటే లోడింగ్ చేసుకోవాలనే ఆలోచనతో వాహనాలకు చెందిన డ్రైవర్లు అతివేగంగా వాహనాలను నడుపుతున్నారు. లోడుతో వెళ్లే వాహనాల సైతం వేగంగా వెళ్లడంతో ఒక్కోసారి లారీ నుంచి పెద్ద పెద్ద రాళ్లు సైతం కిందకు పడుతున్నాయి. వాహనాల రన్నింగ్‌లో పడుతున్న రాళ్లు వల్ల ఏ సమయంలో ఎటువంటి ప్రమాదాన్ని చవిచూడాల్సివస్తుందనే ఆందోళన నెలకుంది. ఇప్పటికే పలువురు ఈ రాళ్ల వల్ల గాయాలపాలైయిన సంఘటనలు ఉన్నాయి. అతివేగం వల్ల ఎదురుగా వచ్చే వాహనదారులు భయాందోళనకు గురౌతున్నారు. అతివేగం వల్ల జరిగిన ప్రమాదంలో ఇటీవల ఒక వ్యక్తి మృతి చెందిన పరిస్థితి ఉంది.

నిబంధనలు ఇలా..

భారీ వాహనాల రాకపోకల వల్ల రహదారిలో దుమ్ము, ధూళి రేగడంతో ప్రయాణికులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గనుల శాఖ కొన్ని నిబంధనలను పెట్టింది. వాస్తవంగా ప్రతీ రోజు ఉదయం సాయంత్రం


ఎటువంటి రక్షణా చర్యలు లేకుండా బండ రాళ్లతో వెళ్తున్న భారీ లారీ


రహదారిలో నీటితో తడపాల్సివుంది. లోడుతో వెళ్లే వాహనాలపై తప్పనిసరిగా టార్పాలిన్‌లతో కప్పాలి. కెపాసిటీకి మంచి లోడింగ్ చేయరాదనే నిబంధన ఉంది. వీటికితోడు గ్రామాల శివారు నుంచి ప్రత్యేక మార్గాలను వేసుకోవాల్సివుంది. అయితే క్వారీ, క్రషర్ యాజమాన్యాల ఇష్టారాజ్యంగా నల్ల రాయి రవాణా సాగిపోతుంది. ప్రభుత్వ నిబంధనలన్నీ ఆయా యాజమాన్యాలు గాలికి వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఈ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

యాచకులకు భోజనం పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

విశ్రాంత ఉపాధ్యాయులు పురాణపండ సత్యనారాయణ మూర్తి, హరి కుసుమాంబ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం యాచకులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకులు శేషసాయి మాట్లాడుతూ తన తాతయ్య సత్యనారాయణమూర్తి 91వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఆపద సమయంలో తనను సంప్రదిస్తే తనకు తోచిన రీతిలో సాయాన్ని అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, రాకేష్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వల్లభ స్వామికి రూ.2.97 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం


యాత్రికులకు భోజనం వడ్డిస్తున్న సేవకులు

మండలం తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.2.97 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్లు ద్వారా రూ 2,08,640, అన్నదాన విరాళాల ద్వారా రూ.55,023, కేశఖండం ద్వారా రూ.9,840, తులాభారం ద్వారా రూ.700, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.23,475 ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణ చార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తుల సహకరించారు.

పలువురిని పరామర్శించిన పొన్నాడ

ప్రజాశక్తి - తాళ్లరేవు


సూర్యకాంతం కుటుంబాన్ని పరామర్శిస్తున్న పొన్నాడ

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను మాజీ ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ శనివారం పరామర్శించారు. పటవల గ్రామంలో కొటికలపూడి సూర్యకాంతం, దంగేటి అప్పారావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం పాత కోరంగిలో నామాడి అబ్బాయి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు..ఈ కార్యక్రమంలో కాట్రేనికొన జడ్‌పిటిసి నేల కిషోర్, స్థానిక నాయకులు కాళా వెంకటరమణ, కొప్పిశెట్టి వెంకట్, కొటికలపూడి చందు, చక్కపల్లి లక్ష్మణ్,నరాల శ్రీనివాస్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం దారుణం


ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంపి వంగా గీత

ప్రజాశక్తి - పిఠాపురం

విజయవాడలో గత ప్రభుత్వం నిర్మించిన డాక్టర్ బిఆర్‌జఅంబేడ్కర్ స్మృతి వనంలోని శిలాఫలకంపై దాడి దారుణమని మాజీ ఎంపి వంగా గీత అన్నారు. శనివారం వైసిపి ఆధ్వర్యంలో స్థానిక రథాలపేటలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో దాడులు, విధ్వంసాలు, హత్యలు పెరిగిపోయాయని విమర్శించారు. ఎంతో మంది వైసిపి నాయకులు, ఇళ్ళు, ఆస్తులపై దాడులు చేసి హింసాత్మక వాతావరణాన్ని సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వర్ధినీడి సుజాత, పి జ్యోతి, గండేపల్లి బాబి, అనాలా సుదర్శన్, కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - కాజులూరు

ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు ప్రారంభం అవుతాయని ఎంపిడిఒ నాగేశ్వరశర్మ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సర్పంచులు, గ్రేడ్ వన్ కార్యదర్శుల నుంచి గ్రేడ్ 5 కార్యదర్శుల వరకూ ఈ శిక్షణ ఉంటుందన్నారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పంచాయతీల నిర్వహణ, చెత్త నుండి సంపద తయారు విధానం, వీధిలైట్లు నిర్వహణపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు ఈ శిక్షణకు తప్పనిసరిగా సర్పంచులు, కార్యదర్శులు హాజరు కావాలని ఆయన కోరారు.

గ్రామ దేవతలకు మొక్కులు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని పలు గ్రామాలకు చెందిన గ్రామ దేవతలకు టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ సతీమణి జ్యోతుల లక్ష్మీదేవి శనివారం మొక్కులు తీర్చుకున్నారు. జగ్గంపేట నియోజకవర్గ ఎంఎల్ఎగా జ్యోతుల నెహ్రూను అఖండ మెజారిటీతో గెలిపించిన సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నట్లు లక్ష్మీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు

17న పెదవలసల ఎస్ఎంసి ఎన్నిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగ పంచాయతీ పెదవలసల ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసి ఎన్నిక ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎంఇఒ ఎ.మంగాయమ్మ తెలిపారు. 8న అనివార్య కారణాల రీత్యా ఎన్నిక నిలిచిపోయిందని, డిఇఒ ఆదేశాలతో తిరిగి 17వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12వ తేదీ లోపు హెచ్ఎంకు తెలియచేయాలని ఓటర్లను కోరారు.

నేరాలు ఘోరాలు

వాహనాల వేలంలో రూ.79 వేల ఆదాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక సెబ్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన వాహనాల వేలం ద్వారా రూ.79,332 ఆదాయం వచ్చిందని ఎస్ఐ. చిట్టిబాబు తెలిపారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన 9 వాహనాలకు వేలం నిర్వహించినట్లు తెలిపారు. 5 వాహనాలను వేలంలో పాడుకున్నారని వెల్లడించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.59,400 కాగా వేలంలో రూ.79,332కు పాడుకున్నారన్నారు. దీనిలో 33 శాతం ఎక్కువ ఆదాయం వచ్చిందని ఎస్.ఐ. తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని కొత్త కంద్రాడ గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... విరవ గ్రామానికి చెందిన కె.సత్తిబాబు(52) తన భార్యతో కలిసి ఉప్పాడ వెళుతుండగా కొత్త కంద్రాడ వద్ద సామర్లకోట నుంచి గొల్లప్రోలు వెళుతున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్తిబాబు అక్కడికక్కడే మరణించగా భార్య సత్యవేణి, మనవడు హేమంత్ గాయాల పాలయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం సత్తబాబు మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ గుణశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఐ.పోలవరం మండలం ఎదుర్లంక గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పితాని రామకృష్ణ(42) గత బుధవారం అమలాపురం వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రామకృష్ణ తీవ్రంగా గాయపడగా, అతడిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

వ్యాపారంలో వచ్చిన నష్టంతో చేసిన అప్పుల భారం అధికం కావడంతో ఒక వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిక్కల గ్రామానికి చెందిన వీరమల్లు వెంకటేశ్వరరావు కోళ్ల ఫారం వ్యాపారం చేస్తూ ఉండేవాడు.ఈ మధ్య కాలంలో వ్యాపారంలో రూ.2.50 లక్షల నష్టం వచ్చింది. దీంతో అప్పులోల్ల నుంచి ఒత్తిడి అధికం అయింది. దీంతో వారి ఒత్తిడిని తట్టుకోలేకపోయిన వెంకటేశ్వర రావు ఈనెల 5వతేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని రాజమహేంద్రవరంలో ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు.



రక్షణ గోడ లేక ఏర్పాటుచేసిన కర్రలు

తాతపూడి పంపింగ్ స్కీమ్‌కు రక్షణ గోడ నిర్మించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

తాతపూడి సమీపంలో గోదావరి ఏటిగట్టుపై ఉన్న పంపింగ్ స్కీమ్ భవనానికి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు .గతంలో ఈ గోడ తుఫాను ఉధృతికి నేలమట్టం కావడంతో ఆ ప్రాంతంలో రక్షణ గోడ కరువైంది. నీటి ఎద్దడి సమయాల్లోనే ఈ పంపింగ్ స్కీం నుండి గోదావరి నది నుంచి సాగునీరుకు వినియోగిస్తారు. అధికారులు మిగిలిన రోజుల్లో ఈ భవనం వైపు కూడా చూడరు. రక్షణ గోడ లేని ప్రాంతంలో కర్రలతో ఏర్పాటు చేశారు. గతంలో ఈ పంపింగ్ స్కీమ్‌లో ఉన్న సామగ్రి చోరీ జరిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. భవనంలో విలువైన మోటార్లు, సామగ్రి, ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు, స్థానికులు, సంబంధిత అధికారులను కోరుతున్నారు.


మంత్రి రవీంద్రకు మొక్క అందజేస్తున్న ఎంఎల్ఎ బండారు

మంత్రి కొల్లు రవీంద్రకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-కొత్తపేట

డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇసుక, సహజ వనరుల లభ్యత పై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరపడానికి జిల్లాకు విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్ర కు కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద శనివారం ఘన స్వాగతం పలికారు. తొలిసారిగా జిల్లాకు వచ్చిన మంత్రి రవీంద్రకు బండారు పుష్ప గుచ్చం అందించి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో కెవి.సత్యనారాయణరెడ్డి, గుత్తుల పట్టాభి, చిలువూరి సతీష్ రాజు, ధరణాల రామకష్ణ, జక్కంపూడి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మిక లోకం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పాలకుల తీరుపై కార్మికులు మరోసారి కదంతొక్కి తమ నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా నిర్వహిం చిన ఆందోళనలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తమన నిరసనను వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్లకు ప్రోత్సాహకాల పేరుతో పెద్ద ఎత్తున రాయితీలు కల్పించిన విషయం విధితమే. అధిక సంఖ్యలో ప్రజలు ఉపాధి పొందుతున్న వ్యవసాయ రంగాన్ని పూర్తిగా అటకె క్కించింది. కనీస మద్దతు ధర లేకపోవటంతో రైతాంగం పూర్తిగా దెబ్బ తింది. అదే విధంగా ప్రభుత్వ రంగ పరి శ్రమలను ప్రయివేటు సంస్థలకు కారు చౌకగా కట్టబెట్టడంతో ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువవుతోంది. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు విజయవంతమైంది. అదేవిధంగా రాష్ట్రంలో పాలకులు స్కీం వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్న తీరును నిరసనగా సిఐటియు ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో వేలాది మంది స్కీం వర్కర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. ఇప్పటికైనా పాలకులు పునరాలోచిం చుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి.

రైతు సమస్యలపై కొరవడిన చిత్తశుద్ధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల సమస్యలపై చిత్తశుద్ధి కొరవడిందనే అభిప్రాయం రైతులలో వ్యక్తమవుతోంది. వ్యవసాయ రంగంలో కీలక భూమిక పోషించే జలవనరులను నిల్వచేసుకునేం దుకు అవకాశాలు ఉన్నా ఆ దిశగా దృష్టి సారించటం లేదు. నిధులు లేక అనేక ప్రాజెక్టులు నీరసించి పోతున్నాయి. పోల వరం నిధుల కేటాయింపులపై కేంద్రం మొండి చేయి చూపిస్తున్న విషయం విధి తమే. మరోవైపు కాటన్ బ్యారేజీ ఎగువన డ్రెడ్జింగ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ లోపించింది. తాజా

గోదారి గలగలలు

వరదలు రైతులకు నిరాశను మిగిల్చాయి. మరో వైపు ప్రతి ఏటా పెరుగుతున్న ఎరువులు, పురుగుల మందుల ధరలకు కళ్లెం వేయటం లేదు. దీంతో సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. సాగు ప్రారంభం అవుతున్న ప్రస్తుత తరుణంలో పెట్టుబడులకు నగదు అందజేసి చిత్తశుద్ధి నిలుపుకోవాల్సి ఉంది. సిసిఆర్‌సి కార్డుల మంజూరులో నిబంధనలు సడలించి అందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు, రైతు సంఘాలు డిమాం డ్ చేస్తున్నాయి. గోదావరి వరదల కారణం గా అనేక పంటలు నేలమట్టం అయ్యాయి. కాల్వల ఆధునీకరణ, పూడికతీతలు లేకపోవటమే ఈ దుస్థితి కారణమని గత అనుభవాలు చెబుతున్నాయి. నూతన ప్రభుత్వమైనా ఆధునీకరణ పనులు దిశగా అడుగులు వేయాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వలంటీర్లు, ఎండియు ఆపరేటర్లపై నీలినీడలు

నూతన ప్రభుత్వ విధానాల ఫలితంగా వలంటీర్లు, ఎండియూ ఆపరేటర్లు, హెల్పర్ల భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. గత పాలనలో స్కీం వర్కర్లతో పాటు వలంటీర్లు, ఎండియూ ఆపరేటర్లు కీలకంగా వ్యవహరించిన విషయం విధితమే. రేషన్ సరఫరాలో ఎండియూ ఆపరేటర్లు, ధృవీకరణ పత్రాలకు దరఖాస్తులు తీసుకోవటంలో వలంటీర్లు కొంత మేర సేవలందించారు. అయితే వీరంతా వైసిపికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు నెలకొన్న విషయం విధితమే. తాజాగా నూతన ప్రభుత్వం పింఛన్ల పంపిణీ ప్రక్రియకు వలంటీర్లను దూరంగా ఉంచింది. రేషన్ సరఫరాకు ఎండియూ ఆపరేటర్ల దూరం కానున్నారని తెలుస్తోంది. తాజాగా తొలగింపుల నేపథ్యంలో ఉపాధికి గండి పడనుంది. ఆయా రంగాలలో పనిచేసే వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.


నిరసనలో మాట్లాడుతున్న నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ నరసింహం

జగ్గంపేటలో వైసిపి కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - జగ్గంపేట

విజయవాడలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనంలో శిలాఫలకాన్ని ధ్వంసానికి నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో కొవ్వత్తులు వెలిగించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్ నుంచి వైఎస్ఆర్ విగ్రహం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట నరసింహం మాట్లాడుతూ ఆ సంఘటనలో పాల్గొన్న దుండగులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట రాంజీ, రామకుర్తి జగాలు, కాపవరపు ప్రసాదు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కంచాల అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చిన్నబ్రహ్మదేవం గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన కంచాలు, గ్లాసులు, చాపలు, ఫ్యాన్లు అందచేశారు. టిడిపి నాయకులు కంచుమర్తి కాటమరాజు, జనసేన నాయకులు చవ్వాకుల బాలరాజు ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన వాటిని వారి చేతుల మీదుగా శనివారం అందచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాయి శ్యామల, ఆయా బట్రెడ్డి అమ్మాజీ పాల్గొన్నారు.


కంచాలు, గ్లాసులు అందచేస్తున్న నాయకులు

ప్రజాశక్తి సర్క్యులేషన్ పెంపుదల క్యాంపెయిన్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మెయిన్‌రోడ్‌లో శనివారం సిపిఎం, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజాశక్తి సర్కులేషన్ క్యాంపెయిన్‌కు విశేష స్పందన లభించింది. శనివారం ఒకరోజు 40 పత్రికలు పెంపుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్, దారపురెడ్డి కృష్ణ, గడిగట్ల సత్తిబాబు, సిరపరపు మరిడియ్య, దాడి బేబీ, మాగాపు నాగు, సిరపరపు శ్రీనివాస్, నెక్కల నరసింహమూర్తి, దారపురెడ్డి సత్యనారాయణ, నెక్కల సూరిబాబు, చల్లా విశ్వనాథం, కూనిరెడ్డి అప్పన్న పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాంపెయిన్‌లో సిపిఎం నాయకులు

మరిడమ్మను దర్శించుకున్న చాగంటి

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మను శనివారం ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామమోహన్ రావు ఆధ్వర్యంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలను అందజేశారు.

క్రియాశీలక సభ్యత్వంలో ప్రసాద్ టాప్

ప్రజాశక్తి - తాళ్లరేవు

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వంలో పి.మల్లవరంకు చెందిన వేగి రుద్రనాగ భైరవప్రసాద్ అగ్రస్థానంలో నిలిచినట్లు జనసేన మండల పార్టీ అధ్యక్షులు అత్తిలి బాబూరావు తెలిపారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు అత్యధికంగా 517 చేయించినట్లు తెలిపారు. మండలానికి చెందిన ఎమ్. హరిసత్య మణికంఠ, పుణ్యమంతుల సత్తిబాబులు 400 పైన సభ్యత్వాలు చేశారన్నారు. మరో 8 మంది 100 క్రియాశీలక సభ్యత్వాలు చేశారని తెలిపారు.

ఇద్దరు బాలికల మిస్సింగ్

- పత్యేక బృందాలతో విచారణకు ఆదేశం
- సౌత్‌జోన్ డిఎస్‌పి అంబికాప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఇద్దరు బాలికల మిస్సింగ్‌కు సంబంధించి తెలిసిన వ్యక్తి ద్వారానే జరిగిందని సౌత్ జోన్ డిఎస్‌పి వి.అంబికాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒరిస్సా రాష్ట్రం బరంపురంకి చెందిన ఒక ఆమె తన భర్తతో విడిపోయి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి గత 8 సంవత్సరాలుగా ధవళేశ్వరం గ్రామంలో నివాసం ఉంటుందన్నారు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నదని తెలిపారు. ఆమె కుమార్తెలు కాకినాడలో వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నారని వివరించారు. మే నెలలో సెలవుల కారణంగా ధవళేశ్వరం గ్రామంలో తల్లి ఇంటి వద్దకు వచ్చి ఉంటున్నారని, మూడు నెలల క్రితం మారోజు వెంకటేష్ అనే వ్యక్తి రైల్వేలో టిసిగా పనిచేస్తున్నట్లు చెప్పి వీరు ఉంటున్న ఇంటి పై పోర్షనులో అద్దెకు దిగాడు. అతనితో పాటు ఒక 17 సంవత్సరాల అమ్మాయి ఉంది. ఆమెను తన చెల్లి అని చెప్పాడు. ఇరుగు పొరుగు వారితో సఖ్యతగా ఉంటూ, ఆ ఇద్దరు పిల్లలను మచ్చిక చేసుకుని, వారి కుటుంబంతో సన్నిహితంగా ఉన్నాడు. పిల్లల తల్లిని అక్క అని పిలిచేవాడు. ఆమెను, ఆమె పిల్లలను, అలాగే పక్క పోర్షన్‌లో నివాసం ఉండే మరొక ఇద్దరు పిల్లలను తీసుకుని, జూన్ నెలలో అరకు వెళ్లి మూడు రోజులు ఉండి వచ్చారు. అలాగే తిరుపతి వెళ్లి మూడు రోజులు ఉండి, విజయవాడ గుడికి వెళ్లి వచ్చారు. నగరంలో షాపింగ్ మాల్‌లకు, గోదావరి ఘాట్‌లకు, హోటల్స్‌కు వారిని తీసుకుని వెళ్ళాడు. ఆ విధంగా వారి కుటుంబం తో బాగా సన్నిహితంగా మెలిగాడు. తల్లికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తాను అని చెప్పి ఆమెను విజయవాడ తీసుకుని వెళ్ళి గత నెల 29వ తేదీకి ముందు రెండు వారాలు ఆమెను విజయవాడలోనే ఉంచాడు. కుమారుడిని ఆమె దగ్గరకు చేర్చాడు. ఆమె కుమార్తెలు ఇద్దరినీ హాస్టల్‌లో దించుతాను అని చెప్పి జూలై నెల 21 వ తేదిన ధవళేశ్వరం గ్రామానికి వచ్చాడు. ఇద్దరు పిల్లలను తల్లితో ఫోన్లో మాట్లాడించి హాస్టల్ కి వెళ్తున్నామని చెప్పి 22 వ తేదీన ఇద్దరు పిల్లలను తీసుకునివెళ్ళాడు. ఆ తర్వాత కూడా తాను ఒక్కడే విజయవాడ వెళ్లి ఆమెను కలిసి వచ్చాడు. 28వ తేదీ నుంచి అతని ఫోన్ స్విచ్ ఆఫ్ రాగా, తల్లికి అనుమానం వచ్చి, గత నెల 29వ తేదీన ధవళేశ్వరం తిరిగి వచ్చి, హాస్టల్ వారితో మాట్లాడింది. తన పిల్లలు హాస్టల్‌కు చేరుకోలేదని తెలుసుకున్న ఆమె ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసును చేధించేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు, రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు పంపించినట్లు వివరించారు. రాజమహేంద్రవరం, ధవళేశ్వరం పరిసర ప్రాంతాల్లో మరో మూడు బృందాలతో విచారణ జరుగుతుందని తెలిపారు. 22వ తేదీ తర్వాత రాజమహేంద్రవరంలో ఒక హోటల్లో ఒకరోజు, ఆ తర్వాత నెల్లూరులో ఒక హోటల్లో ఒకరోజు ఆ పిల్లలతో మారోజు వెంకటేష్ ఉన్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. 28వ తేదీ ఉదయం తనతో ఉన్న బాలికను రాజమహేంద్రవరం బస్టాండ్‌లో విశాఖపట్నం వెళ్లే బస్సు ఎక్కించి ఆమెను విజయనగరంలోని తన ఇంటికి వెళ్లి పొమ్మని పంపించేశాడు. 28వ తేదీ సాయంత్రం 7 గంటల నుంచి గుంటూరు ప్రాంతంలో అతని ఫోను స్విచ్ ఆఫ్ చేయబడిందని డిఎస్‌పి తెలిపారు.


క్వారీ మార్కెట్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి శ్రేణులు

శిలాఫలకం ధ్వంసానికి నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విజయవాడలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనంలో శిలాఫలకంపై దాడికి నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో కొవ్వత్తులు వెలిగించి ర్యాలీ జరిగింది. శనివారం రాజమహేంద్రవరంలోని క్వారీ జంక్షన్లో వైసిపి శ్రేణులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ వైసిపి ఇన్ ఛార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ స్మృతివనంలో శిలాఫలకం ధ్వంసాన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కోరారు. ఈ సంఘటనపై సిఎం, డిప్యూటీ సీఎంలు స్పందిం చకపోవడం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. హామీలపై ప్రజల దృష్టిని మరల్చేందుకే వైసిపి నాయకులపై దాడులకు పాల్పడుతుందని అన్నారు. టిడిపి మూకల దాడులలో అనేకమంది వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి మూకల దాడులను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నక్కా శ్రీనగేష్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, తిరగతి దుర్గా, కాటం రజనీకాంత్, మార్తి లక్ష్మి, సాలా సావిత్రి, దాసి వెంకట్రావు, కానుబోయిన సాగర్, మజ్జి అప్పారావు, బిల్డర్ చిన్న, గణేష్, సాంబ, పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ డిఎస్‌పిని కలిసిన గన్ని


డిఎస్‌పిని కలిసిన టిడిపి నేత గన్ని కృష్ణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సెంట్రల్ జోన్ డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన కె.రమేష్‌బాబును టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సెంట్రల్ జోన్ పరిధిలో శాంతి భద్రతలు, ట్రాఫిక్, నేరాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'మత్రి' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- కడియం

వికలాంగ ఉద్యోగులకు అండగా నిలుస్తూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న వికలాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మత్రి కాశీ విశ్వనాథ్ సేవలు అభినందనీయమని ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నాయకుడు ఎ.విద్యాసాగర్ పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రతినిధి పి.అశ్వత్థప్ప ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండి జానీబాషా, ఎం.కాశీవిశ్వనాథ్, టి.రామాంజనేయులు, ప్రేమ్ సుధాకర్, బి.రోజా ప్రకాష్, ఎస్.కె.సుభాని, ఎన్.రాజేష్ బాబు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణం లోని టిడిపికార్యాలయం వద్ద రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీనికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ నియోజకవర్గం లో వైద్యంచేయించుకోలేని నిరుపేద చిన్నారులకు సంబంధించి గుండె జబ్బులు, డయాబెటిస్ ఆర్థోపెడిక్ ఇంకా ఆనేక అనారోగ్య సమస్యలకుమెడికల్ క్యాంపు లో పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఆపరేషన్లకు ఏర్పాటు చేస్తామన్నారు. చిన్న పిల్లలకు గుండెల్లో రంధ్రాలు ఉండటం వల్ల పలువురు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని వారందరికీ ఉపయోగపడే విధంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి పలువురు వైద్యులు ఉద్యోగులు, హాజరయ్యారు. చిన్నారులకు అవసరమైన మెడిసిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, టిడిపి,అభిమానులు పాల్గొన్నారు.


చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న మంత్రి సుభాష్

ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా బాబ్జి

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పళ్ళ సూర్యప్రకాశరావు (బాబ్జి)ఎన్నికయ్యారు. సీనియర్ పాత్రికేయులు సిఎస్.మూర్తి ఆధ్వర్యంలో శనివారం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శిగా జిత్తుక రాంప్రసాద్, కోశాధికారిగా ఇసుకపూడి ప్రఫుల్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా మద్దింశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కోన సత్తిబాబు, జల్లి విక్టర్ కుమార్ గుత్తుల ఏడుకొండలు, సహాయ కార్యదర్శిగా దంగేటి సోమేష్, సహాయ కోశాధికారిగా వేపకాయల రాజు, సభ్యులు మట్టపర్తి శ్రీనివాస్, మాలే వెంకట దుర్గాప్రసాద్, మహిపాల నాగరాజు, గోసంగి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.